సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం ; 8 ; మార్చి ; 2024



న్యూస్‌రీల్

మేనిఫెస్టోలో చేర్చాలి

ఆదిలాబాద్‌రూరల్: మాలీలకు ఎస్టీ హోదా కల్పిస్తామని అన్ని రాజకీయ పార్టీలు రానున్న పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్టహౌస్‌లో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో స్పష్టమైన హామీ ఇచ్చిన పార్టీకే తమ మద్దతు ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఏ పార్టీ హామీ ఇవ్వకుంటే ఎన్నికలు బహిష్కరించి ఐక్యత చాటాలని కులస్తులకు పిలుపునిచ్చారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ నరేందర్ మాట్లాడారు. వైద్యారోగ్యశాఖలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని తెలిపారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు దొంతుల ప్రవీణ్, అనిల్, కిరణ్, రమణ, ప్రశాంత్, నవీన్, విష్ణు, విజయ్, అనూష, రజిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం


బ్రహ్మానందరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్-1 ఐఎన్టీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర సలహాదారుగా ఎస్.బ్రహ్మానందరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కే సాయిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బ్రహ్మానందరెడ్డి ఇచ్చోడ పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. బ్రహ్మానందరెడ్డి నియామకంపై జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి కృష్ణ, అల్లాడి రఘురాం, బాధ్యులు సంపత్‌కుమారి హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ ధర్నా


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఎలక్టోరల్ బాండ్లకు వ్యతిరేకంగా గురువారం కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లోగల ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం 2018లో ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీకే అత్యధిక లబ్ధి చేకూరిందని ఆరోపించారు. బాండ్లు కొనుగోలు చేసినవారి పేర్లు బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఎస్‌బీఐ తాత్సారం చేస్తోందని విమర్శించారు. వెంటనే పేర్లు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నగేశ్, నాయకులు సంతోష్, పోతారెడ్డి, గంగారెడ్డి, ఎంఏ షకీల్, మహ్మద్ రఫీక్, ప్రభాకర్, శంకరయ్య, రవి, శంకర్, ఎంఏ ముఖీమ్, రాజ్ మహ్మద్, సుధాకర్‌గౌడ్, రమణ, షేక్ మన్సూర్, తలా చౌష్, అఖిబ్, షాదాబ్, ఇందిర, లత, మీరాబాయి, సుమ, సంగీత, జుబేదా, సోనియా పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు పారిశ్రామిక వేత్తలు చొరవ చూపాలి

ఆదిలాబాద్: పారిశ్రామిక వేత్తలు యువతకు ఉపాధి కల్పన విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సేవలు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పారిశ్రామికవేత్తలు కృషి చేయాలన్నారు. ఐటీఐ వారు తరచూ అప్రెంటిషిప్‌మేళా ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులు వృద్ధి చేసుకుంటూ యువతకు ఉపాధి అవకాశాలు చూపి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఐటీఐ రీజినల్ డైరెక్టర్ సీతారాములు, ప్రిన్సిపాల్ సుజాత, శిక్షణాధికారి శ్రీనివాస్, పరిశ్రమలశాఖ జీఎం పద్మభూషణ్‌రాజు, డీసీసీటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, పారిశ్రామిక వేత్తలు, ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

అవనిలో సగం..

తల్లిగా, చెల్లిగా, భార్యగా, కూతురిగా.. అన్నింటా నిండి.. వెన్నంటే ఉండి.. ప్రతీ మగాడి విజయం వెనుక ఉండే మహిళలు వారికి నీడలా నిలుస్తున్నారు. ఆకాశమే హద్దుగా.. అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకుపోతున్నారు. పురుషులతో సమానస్థాయిలో నిలుస్తూ తాము ఆకాశంలో సగం.. అవనిలో సగం అన్నట్లుగా ముందుకెళ్తున్నారు. అందుకే స్త్రీ విలువ తెలిసినా కొందరు తల్లిదండ్రులు మొదటి సంతానంగా కూతురు జన్మించినా ఒక్కరే చాలని సరిపెట్టుకున్నారు. సమాజంలో మంచి స్థాయిలో నిలబెట్టాలని ఉన్నత చదువులు చదివిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

– కైలాస్‌నగర్

- మొదటి సంతానంలో జన్మించిన కూతురుతోనే సరిపెట్టుకున్న తల్లిదండ్రులు
- ఉన్నతులుగా తీర్చిదిద్దాలని ముందుకు..
- ఆదర్శంగా నిలుస్తున్న అమ్మానాన్నలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కూతురిని ఐఏఎస్ చేయడమే లక్ష్యం


కూతురు సాయిచందనారెడ్డితో శ్రీకాంత్‌రెడ్డి-రచన దంపతులు

మావల మండల కేంద్రానికి చెందిన ఆదర్శ రైతు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి-రచన దంపతులకు సాయిచందనారెడ్డి ఏకైక కూతురు. ఆడ, మగ సమానమని భావించిన ఈ దంపతులు ఒక్క కూతురుతోనే సంతోషపడ్డారు. ఆడపిల్ల అని వివక్ష చూపకుండా ఆమెను ఉన్నత స్థానంలో నిలబెట్టడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఇంటర్మీడియట్ వరకు హైదరాబాద్‌లోని శ్రీచైతన్య, డిగ్రీ నారాయణ కళాశాలలో చదివించారు. డిగ్రీ పూర్తి చేసిన సాయిచందన కలెక్టర్ కావాలని కలలుగన్నారు. కూతురు ఇష్టానికి అనుగుణంగా ఢిల్లీలోని ప్రముఖ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా కూతురును కలెక్టర్ చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. వారి కలలను నిజం చేసేలా సాయిచందన సివిల్స్‌కు సిద్ధమవుతోంది. కచ్చితంగా మెరుగైన ర్యాంక్ సాధిస్తానని పేర్కొంది.

కూతురి ఇష్టానికి అనుగుణంగా..


కూతురు నందినితో జనగం సంతోష్-సంగీత దంపతులు

ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లికి చెందిన జనగం సంతోష్-సంగీత దంపతులు రాజకీయ నాయకులు. ఆర్థికంగా ఉన్నవారే. అయినప్పటికీ బాబు అయినా, పాప అయినా ఒక్కరే కావాలని ముందుగానే నిర్ణయించుకున్నారు. మొదటి సంతానంగా కూతురు పుట్టడంతో అల్లారుముద్దుగా పెంచారు. ఇంటర్మీడియట్ వరకు హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో, పీజీ హైదరాబాద్ యూనివర్సిటీలో చదివించారు. ప్రస్తుతం నందిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆమెను కలెక్టర్‌ను చేయడమే తమ లక్ష్యమని, ఆ దిశగా సన్నద్ధం చేస్తున్నట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు.


ప్రజ్ఞతో జలంధర్‌రెడ్డి-పద్మ దంపతులు

డాక్టర్ చేయాలనే తలంపుతో..

బేల మండలం అవాల్‌పూర్ గ్రామానికి చెందిన మినక జలంధర్‌రెడ్డి-పద్మ దంపతులు ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో స్థిరపడ్డారు. వారికి ప్రజ్ఞ ఏకైక సంతానం. ఆడపిల్ల పుట్టిందని బాధపడకుండా ఆమెను ఉన్నత స్థానంలో నిలపడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోని కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ, హైదరాబాద్‌లోని శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్ చదివించారు. చదువులో రాణించిన ప్రజ్ఞ నీట్‌లో మంచి ర్యాంక్ సాధించి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ప్రస్తుతం నాలుగో సంవత్సరం చదువుతోంది. 'మాకు కూతురైనా, కొడుకైనా ఒక్కరేకావాలని నిర్ణయించుకున్నాం. డాక్టర్‌ను చేశాం. ప్రజ్ఞను ఎంఎస్ సర్జన్ చేయాలన్నదే మా లక్ష్యం' అని ఆమె తల్లిదండ్రులు గర్వంగా చెబుతున్నారు.

సర్కారు స్కూళ్లలో చదివిస్తూ..


కూతురు శ్రీలాస్యతో శ్రీకాంత్-మంజుల దంపతులు

ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్ వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయన భార్య మంజుల గృహిణి. వారికి శ్రీలాస్య ఏకై క కూతురు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తమ కూతురికి విలువలతో కూడిన విద్య అందించాలని భావించిన ఆయన తాను చదువు చెప్పే పాఠశాలలోనే చదివించారు. ఆరోతరగతి వరకు తలమడుగు మండలం కజ్జర్లలో, ఏడో తరగతి భీంసరిలో, 8,9,10 తరగతులు ఆదిలాబాద్ పట్టణంలోని సరస్వతీనగర్‌లోని సర్కారు బడుల్లో చదివించారు. కూతురిని కొడుకులా భావించిన ఆ తల్లిదండ్రులు ఆమెకు ఉజ్వల భవిష్యత్ అందించాలని సంకల్పించారు. ఆ దిశగా ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్సార్ జూనియర్ కళాశాలలో చేర్పించారు. ప్రస్తుతం శ్రీలాస్య ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతోంది. తమ కూతురు ఇష్టాలకు అనుగుణంగా ఉన్నత విద్య అందించేందుకు కృషి చేస్తామని శ్రీలాస్య తల్లిదండ్రులు శ్రీకాంత్-మంజుల దంపతులు పేర్కొన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...


కూతురు సంగీతతో ప్రహ్లాద్

సిరికొండ: మండలంలోని రాంపూర్(బీ) గ్రామానికి చెందిన సూర్యవంశీ ప్రహ్లాద్, బాగుబాయి దంపతులకు కుమార్తె సంగీత ఒక్కరే సంతానం. చిన్ననాటి నుంచి సంగీత చదువులో ముందుండేది. పెద్దయ్యాక ఏంచేస్తావ్.. అని అడిగితే డాక్టర్ అవుతానని చెప్పేది. కూతురు చిన్ననాటి మాటలను నిజం చేయాలని ఆ దంపతులు నిర్ణయించుకున్నారు. 1నుంచి పదో తరగతి వరకు ఇంద్రవెల్లి మండలం దన్నూర ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని చైతన్య కళాశాలలో చదివింది. నీట్‌లో ప్రతిభ కనబరిచి పిలిప్పిన్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. గతేడాది నుంచి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఆడపిల్లలను ఎందులోనూ తక్కువగా చూడొద్దని, వారి అభిరుచులు, ఇష్టాలను గుర్తించాలంటోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే లక్ష్యం చేరుకున్నట్లు సంగీత పేర్కొంది.

యువతకు ఆదర్శం సాహితీరెడ్డి


తల్లిదండ్రులు గోవర్ధన్‌రెడ్డి, జయశ్రీతో సాహితీరెడ్డి

తాంసి: మండల కేంద్రానికి చెందిన కంది గోవర్ధన్‌రెడ్డి, జయశ్రీ దంపతులకు కుమార్తె సాహితీరెడ్డి ఒక్కరే సంతానం. వారిది వ్యవసాయ కుటుంబం. కూతుర్ని ఉన్నతంగా చదివించాలని నిర్ణయించుకున్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు రాంపూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలో, 8 నుంచి పదో తరగతి వరకు హైదరాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని చైతన్య కళాశాలలో చదివించారు. నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన సాహితీరెడ్డి వరంగల్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఎంబీబీఎస్ పూర్తి కావడంతో ప్రస్తుతం జనరల్ సర్జన్ పరీక్షకు సన్నద్ధమవుతోంది. తల్లిదండ్రుల లక్ష్యం నేరవేరుస్తున్న సాహితీరెడ్డి నేటి యువత, మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. యువత అవకాశాలు అందిపుచ్చుకుని అన్నిరంగాల్లో ముందుకెళ్లాలని సూచిస్తోంది.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి


మోటార్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కైలాస్‌నగర్: వేసవిలో పట్టణంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గల, ఫిల్టర్‌బెడ్‌లోని రిజర్వాయర్లను పరిశీలించారు. పట్టణానికి నీరు సరఫరా అవుతున్న తీరుపై ఆరా తీశారు. ఆదిలాబాద్ శివారు ప్రాంతాలు, పట్టణంలోని పలు కాలనీల్లో వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాగు నీరందించాలని అధికారులకు సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అవినీతి కారణంగా మిషన్ భగీరథ పథకం పూర్తిగా నిర్వీర్యమైందని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, డీఈ తిరుపతి, ఏఈ అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని 104 సర్వీస్ వాహనాల ఉద్యోగులు గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. 16 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. 2021లో 104 వాహనాలను నిలిపివేసిన ప్రభుత్వం ఉద్యోగులకు భద్రత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, అర్హులైన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి నేరుగా ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించాలని, బేసిక్ పే విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు ఆనంద్, సురేందర్, నాగ్‌నాథ్, సుభాష్, ఇబ్రహీం, ప్రశాంత్, సంధ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షాకేంద్రం తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నలందలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. గురువారం ఫస్టియర్ పరీక్షలకు 8,009 మంది విద్యార్థులకు 7,518 మంది హాజరు కాగా 591 మంది గైర్హాజరయ్యారు.

ఆగని అఘాయిత్యాలు

- పెరుగుతున్న మహిళలపై వేధింపులు
- నేటికీ కొనసాగుతున్న లింగవివక్ష

జిల్లాలో మహిళా వేధింపుల కేసులు

కేసులు	2022	2023
వరకట్న హత్యలు	2	1
వరకట్న ఆత్మహత్యలు	3	1
ఆత్మహత్యలు	8	6
వేధింపులు	149	145
హత్యలు	3	5
అత్యాచారాలు	41	35
కిడ్నాప్ కేసులు	18	23
హింస	80	88
వివాహేతర సంబంధం	11	7
ఈవ్‌టీజింగ్	13	11
మొత్తం	328	322

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మహిళలపై రోజురోజుకూ వేధింపులు, దారుణాలు, అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరుగుతున్నాయి. వరకట్న వేధింపులు, అత్తామామలు, భార్యాభర్తల గొడవలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కార్యాలయాలు, పని స్థలాల్లో తరచూ అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. చట్టాలు కఠినంగా ఉన్నా నిందితులు తప్పించుకుతిరుగుతున్నారు. వీటిని భరించలేక కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. మరికొందరు హత్యకు గురవుతున్నారు. వీటిని పూర్తిస్థాయిలో నివారించడంలో పోలీస్‌శాఖ విఫలమవుతుందనే ఆరోపణలున్నాయి.

కొనసాగుతున్న లింగవివక్ష

మహిళలు అర్ధరాత్రి ఒంటరిగా వారి గమ్యానికి క్షేమంగా చేరుకున్నప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని పెద్దలు చెప్పుకొచ్చారు. కానీ.. నేడు ఆ పరిస్థితి కనిపించడంలేదు. రోజురోజుకూ మహిళలు వ్యవసాయం, రాజకీయం, క్రీడలు ఇలా అన్ని రంగాల్లో రాణిస్తున్నా పరిస్థితులు మారడంలేదు. పురుషులతో సమానంగా రాణిస్తున్నా లింగ వివక్ష కొనసాగుతూనే ఉంది.

2022 నుంచి నమోదైన కేసులు

జిల్లాలో 2022లో 328, 2023లో 322 మహిళా వేధింపు కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది సుమారు 100 కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. గతేడాది రెండు వరకట్న హత్యలు, ఆరు ఆత్మహత్యలు, 145 వేధింపులు, ఐదు మహిళా హత్యలు, 35 అత్యాచారాలు, 23 కిడ్నాపింగ్, 88 దౌర్జన్య కేసులు, ఏడు రెండో వివాహ కేసులు, 11 ఈవ్‌టీజింగ్ కేసులు నమోదయ్యాయి.

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి



మహిళల భద్రత కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. జిల్లా కేంద్రంలో బీట్ పెట్రోలింగ్ చేపడుతున్నాం. షీటీమ్‌ల ద్వారా విద్యా సంస్థలు, రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎవరైనా వేధింపులకు గురైతే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని సహాయపడతారు. వేధింపులకు గురిచేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

– గౌస్ ఆలం, ఎస్పీ

ఆమెకు ప్రాతినిధ్యమేది..?

- చట్టసభల్లో మహిళలు అంతంతే
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలుగా తక్కువే
- రాజకీయాల్లో ఉన్నా పదవులు అందని ద్రాక్షే
- 33శాతం మహిళా కోటా అమలైతేనే ఊరట

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అన్నింటా ఆమె సగం అనే మాటలు చట్టసభల అవకాశాల్లో అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. కీలకమైన శాసనసభ, శాసన మండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం అసమానతను తెలియజేస్తోంది. ఉమ్మడి జిల్లా జనాభా, ఓటర్ల పరంగా చూస్తే మగవారితో సమానంగా.. ఇంకా సరిగ్గా చెప్పాలంటే కొన్ని చోట్ల మహిళలే అధికంగా ఉన్నారు. కానీ చట్టసభలకు ఆమడదూరంలో ఉన్నారు. రాజకీయ పార్టీలు సైతం మహిళలకు టికెట్లు ఇచ్చి ప్రోత్సహించడమే కరువైంది.

అందని అవకాశాలు..

73ఏళ్ల ఎన్నికల గణాంకాలు పరిశీలిస్తే ఉమ్మడి జిల్లా పది అసెంబ్లీ స్థానాల్లో ప్రతీ ఐదేళ్లకోసారి సగటున 15మంది చొప్పున సుమారు 150పైగా మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో మొత్తంగా ఏడుగురే మహిళా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో ముగ్గురు రెండు సార్లు గెలిచారు. ఇక పెద్దపల్లి, ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో 36మంది ఎంపీలుగా ఎన్నికయ్యారు. 1998, 1999 ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున డాక్టర్ సుగుణకుమారి ఎంపీగా ఎన్నికయ్యారు. మిగతా ఏ ఒక్కరికి అవకాశం దక్కలేదు. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మహిళలెవరూ ఎన్నిక కాలేదు.

33శాతం కోటా అమలైతే..

గత సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో 33శాతం సీట్లు మహిళలకు రిజర్వు చేసే 128వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడితే పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ చట్టం అమలులోకి వస్తే ఇప్పుడున్న పది స్థానాల్లో కనీసం రెండు నుంచి మూడు స్థానాల వరకు మహిళలకే దక్కనున్నాయి. ఎస్సీ, ఎస్టీ స్థానాలు పోను ఒకటే జనరల్ స్థానం ఉండనుంది. భవిష్యత్‌లో మహిళా నాయకులకు అవకాశాలు మెరుగుపడనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో స్త్రీ-పురుష ఓటర్లు

నియోజక వర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
సిర్పూర్	1,14,484	1,14,359	12	2,28,855
చెన్నూర్	95,974	97,264	07	1,93,245
బెల్లంపల్లి	86,802	88,530	13	1,75,345
మంచిర్యాల	1,38,472	1,40,559	25	2,79,056
ఆసిఫాబాద్	1,12,510	1,14,056	16	2,26,582
ఖానాపూర్	1,09,508	1,14,445	13	2,23,966
ఆదిలాబాద్	1,19,154	1,24,375	06	2,43,535
బోథ్	1,02,333	1,08,580	02	2,10,915
నిర్మల్	1,21,070	1,35,057	20	2,56,147
ముథోల్	1,23,208	1,30,378	18	2,53,604
మొత్తం	11,23,515	11,67,603	132	22,91,250

అవకాశాలు ఇవ్వాలి



రాజకీయంగా ఎంతోమంది మహిళలు కష్టపడుతున్నా వారికి తగిన అవకాశాలు రావడం లేదు. డబ్బు, హోదా ఉన్న మగవారి ఆధిపత్య ధోరణి ఇంకా కొనసాగుతోంది. ఈ పరిస్థితి మారాలి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, చట్టసభల్లోనూ అవకాశాలు కల్పిస్తుందనే భరోసా ఉంది.

– రామిశ్ల రాధిక, కాంగ్రెస్ నాయకురాలు

మహిళా బిల్లుతో మేలు



భవిష్యత్‌లో మహిళా బిల్లుతో చట్టసభల్లో అవకాశాలు మెరుగుపడనున్నాయి. 33శాతం కంటే 50శాతం అమలు చేస్తే అందరికీ సమాన అవకాశాలు ఇచ్చినట్లు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి.– అమురాజుల శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే, బెల్లంపల్లి

అర్హులకు లబ్ధి చేకూరేలా చూడాలి

ఇంద్రవెల్లి: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టి, అర్హులకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి నాగోబా ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ నాగోబా అలయ అభివృద్ధి వివరాలు తెలుసుకున్నారు. అమరవీరుల స్తూపాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి స్మృతి వనం, స్తూపం అభివృద్ధి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లి మండలంలోని మారుమూల గ్రామాల్లోని తాగునీటి సమస్య పరిష్కరించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకుడు సోమోరే నాగోరావ్ కలెక్టర్‌ను కోరారు. ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, జెడ్పీటీసీ సభ్యురాలు ఆర్క పుష్పలత తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కలెక్టర్ రాజర్షి షా
- ఘనంగా మహిళా దినోత్సవం

కైలాస్‌నగర్: ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఆడ, మగ అనే వివక్ష చూపకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని సూచించారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియాను నిత్య జీవితానికి అవసరమైన మంచి పనులకు మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మహిళలపై గౌరవభావంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురు మహిళా ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి అభినందించారు. పలువురు అంగన్‌వాడీలకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. డీఈవో ప్రణీత, జిల్లా సంక్షేమాధికారి సబిత, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, డీఎస్సీడీవో సునీతాకుమారి, గ్రౌండ్ వాటర్ ఏడీ శ్రీవల్లి, డీఆర్డీవో సాయన్న పాల్గొన్నారు.


కలెక్టర్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు

క్లుప్తంగా

బాసర ఆలయంలో బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

భైంసా: బాసర ఆలయంలో గురువారం కార్యనిర్వహణాధికారి కార్యాలయ ఆవరణలో దేవస్థాన వ్యవసాయ భూములు వివిధ హక్కులకు బహిరంగ వేలం నిర్వహించారు. బాసర గ్రామ శివారులో రైల్వేస్టేషన్ సమీపంలో సర్వే నెం.538/3లోని 4.27 ఎకరాల వ్యవసాయ భూమి కౌలు నిమిత్తం ఏడాది కాలపరిమితికి రూ.27000లకు హెచ్చు పట్టాదారు మనోహర్ దక్కించుకున్నారు. బాసర గ్రామ శివారులో గోదావరి దారి సర్వే నెం.438లోని 18.19 ఎకరాల వ్యవసాయ భూమి సాగు కౌలు నిమిత్తం ఏడాది కోసం రూ.3,62,000లకు హెచ్చు పట్టాదారు పి.సుజిత్ దక్కించుకున్నాడు. దేవస్థాన పేరు ముద్రించిన సాదా కండువాలు జాకెట్ ముక్కల సరఫరాను అనంతుల కేదారి క్లాత్ స్టోర్స్ వరంగల్, ఒడి బియ్యంలో వచ్చిన ఎండు కుడుకలు, బాదాములు, బరిడి పోకలు, పసుపు కొమ్ములు వగైరా ప్రోగు చేసుకునే హక్కును గాదేవార్ గోపి దక్కించుకున్నారు.

వాయిదా పడింది...

అమ్మవారి రోజువారి అలంకరణ కోసం విడి పూలు, పూలదండలు ద్వారముల తోరణాలు, గజమాల సరఫరా చేయడంతో పాటు లక్ష్మి సదనము వెనుక గల తాత్కాలిక షాప్ నెంబర్ 3,4,5 సరైన పాట రానందున వాయిదా వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

చేనులో కాలిబూడిదైన శనగ పంట



కాలిపోతున్న శనగ పంట

జైనథ్: మండలంలోని నిరాల గ్రామంలో దారుణం జరిగింది. గ్రామానికి చెందిన షేక్ సలీంకు చెందిన శనగ పంట కుప్ప పూర్తిగా బూడిదైంది. స్థానికుల కథనం ప్రకారం... సలీం రెండెకరాల చేనులో శనగ పంట వేశాడు. ఇటీవలే పంట కోతకు రావడంతో కోత కోసి చేనులో కుప్పగా పోశాడు. బుధవారం రాత్రి భోజనం కోసం ఇంటికి వచ్చి వెళ్లి చూడగా మంటల్లో కాలి బూడిదైంది. దీంతో సదరు రైతు లబోదిబోమంటూ బోరున విలపించాడు. సుమారుగా రూ.1.10లక్షల విలువ చేసే 25 క్వింటాళ్ల శనగ పంట కాలిపోయినట్లు వాపోతున్నాడు. ఎవరైన పంటకు నిప్పు పెట్టారా? ప్రమాదవశాత్తు జరిగిందా? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు సలీం వేడుకుంటున్నాడు.

జయహో నారీ



సాగులో మేటి శిరీష



శిరీష, మహిళా రైతు

లోకేశ్వరం: లోకేశ్వరం మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మగ్గిడి శిరీష సాగులో తనకంటూ ఓ గుర్తింపు సాధించింది. భర్త సాయారెడ్డి కూడా రైతే కావడంతో ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటూ అన్ని రకాల పంటల సాగులో రాణిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు పురుషోత్తంరెడ్డి (7వ తరగతి), చిన్నకుమారుడు ముత్యం రెడ్డి (5వ తరగతి). ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో 15ఏళ్లుగా శిరీష బెండ, టమాట, బీరకాయ, ఉల్లిగడ్డ, కొత్తిమీర, బీన్నిస్‌కాయ, చిక్కుడుకాయ, వరి, మిర్చి, జొన్న, మొక్కజొన్న పంటలు సాగుచేస్తోంది. డ్రిప్ విధానం సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తుండడం విశేషం. శిరీష కొంత మేరకు చదువుకోగా ఆమె భర్త సాయారెడ్డి డీగ్రీ పూర్తిచేశాడు. అయిప్పటికీ వ్యవసాయ, ఉద్యాన వన అధికారిల సహకారంతో పంటలు సాగు చేస్తున్నారు.



ఎద్దుల బండితో శిరీష

కూతురునే కుమారుడిగా..



తల్లిదండ్రులతో సక్రపు శైలజ

కుంటాల: మహిళలను పూజించాలనే ధ్యేయంతోనే కూతురు చాలు అనుకున్నారు. కూతురులోనే కుమారుడుని చూసుకుంటూ అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు కుంటాల మండల కేంద్రానికి చెందిన సక్రపు ప్రమీల–గజేందర్ దంపతులు. గజేందర్ కుంటాల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండగా భార్య ప్రమీల గృహిణిగా వ్యవహరిస్తుంది. వీరి కూతురు సక్రపు శైలజ. ఒకతే కూతురు. ఉన్నత చదువులు చదివించడంతో వైద్య విద్యలో నీట్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 1500 ర్యాంక్ సాధించింది. సిద్దిపేట ఆర్వీఎం మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొంది వచ్చే మార్చిలో పూర్తి చేసుకోనుంది. శస్త్ర చికిత్స నిపుణురాలుగా ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంతో చదువుతున్నానని శైలజ చెబుతోంది.

ట్రిపుల్‌ఐటీలో మహిళా దినోత్సవం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నందితసేతి మాట్లాడుతూ సుధామూర్తిలాంటి గొప్ప మహిళల విజయగాథలన్నింటిని తెలుసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ రంగంలో మహిళలు రాణించాలని సూచించారు. సవాళ్లను అధిగమించడానికి పరిమితుల నుంచి విముక్తి పొందడానికి కొత్త అవకాశాలను స్వీకరించేందుకు సిద్ధం కావాలని సూచించారు. కేరీర్‌తోపాటు కుటుంబాన్ని సమతుల్యం చేసుకుంటూ మహిళలు ఒత్తిడిని అధిగమిస్తూ అన్నిరంగాల్లో రాణించాలని తెలిపారు. ఆర్జీయూకేటీ విద్యార్థులు ఉమెన్స్‌లైఫ్ స్కిట్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ కె. పావని, కేఆర్‌సీ మూర్తి, నాగలక్ష్మి పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

అభిరుచినే ఉపాధిగా మలుచుకుని..



ప్రముఖ నటితో రంగు సౌమ్య

భైంసాటౌన్: నృత్యంపై తనకు చిన్ననాటి నుంచి ఉన్న అభిరుచిని ఉపాధిగా మలుచుకుని రాణిస్తున్నారు భైంసాకు చెందిన రంగు సౌమ్య. తనకు పెళ్లయిన తరువాతనే భర్త రంగు సంపత్‌కుమార్ ప్రోత్సాహంతో నిజామాబాద్‌లో నృత్య గురువులు భీమన్, దేవులపల్లి ప్రశాంత్ వద్ద నాలుగేళ్లపాటు కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకుంది. అనంతరం భైంసాలో తానే సొంతంగా శ్రీ నయనం నృత్యా కళానిలయం పేరిట చిన్నారులకు నృత్యంలో శిక్షణ అందిస్తోంది. మొదట కేవలం ఐదుగురు చిన్నారులతో ప్రారంభించి, నేడు దాదాపు వందవరకు చిన్నారులు తన వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్నారు.

శిష్యబృందంతో ప్రదర్శనలు..

- అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని తన శిష్యబృందంతో నృత్య ప్రదర్శన నిర్వహించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.
- ఇటీవల అరుణాచలంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పదిహేను మంది చిన్నారులతో కలిసి నృత్య ప్రదర్శన నిర్వహించారు.
- హైదరాబాద్‌లోని యంలో నిర్వహించిన గిన్నిస్‌బుక్ రికార్డు నృత్య ప్రదర్శనలో సైతం తన శిష్య బృందంతో పాల్గొని గిన్నిస్‌బుక్ వారి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు.



హైదరాబాద్‌లో గిన్నిస్ రికార్డు ప్రదర్శనలో శిష్యబృందంతో సౌమ్య

కష్టాలకెదురీదుతూ...

- మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్న అనూష
- అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం
- ప్రభుత్వం సహాయం కోసం ఎదురుచూపు



రాథోడ్ అనూష

భైంసాటౌన్: కష్టాలకు ఎదురీదుతూ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటోంది తానూర్ మండలం బామ్ని తండాకు చెందిన రాథోడ్ అనూష. ఆరు నుంచి పదో తరగతి వరకు భైంసాలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న అనూషకు ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు, ఒక అన్న ఉన్నారు. అక్కకు పెళ్లి కాగా, చెల్లి అనారోగ్యంతో ఇంటిపట్టునే ఉంటుండగా.. మరో చెల్లి ఇంటర్ చదువుతోంది. అన్న డిగ్రీ చదువుతూనే నాన్నకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా నిలుస్తున్నాడు. అనూష భైంసాలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న సమయంలో కరాటే మాస్టర్ శ్రీరాముల సాయికృష్ణ పాఠశాలలో విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చేవాడు. ఈ క్రమంలో అనూష ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాడు. దీంతో కరాటే, కిక్‌బాక్సింగ్, వుషూ మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలు సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సైతం కైవసం చేసుకుంది. ప్రస్తుతం తను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ విద్యనే మరికొందరికి నేర్పిస్తూ ఉపాధి పొందుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక కొన్నిసార్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనలేకపోయానని, ప్రభుత్వం ఆదరిస్తే మరింతగా రాణించి జిలా ్లకు, రాష్ట్రానికి పేరు తెస్తానని చెబుతోంది.



అంతర్జాతీయ కిక్‌బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన అనూష (ఫైల్)

శిష్యబృందంతో ప్రదర్శనలు..

- అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని తన శిష్యబృందంతో నృత్య ప్రదర్శన నిర్వహించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.
- ఇటీవల అరుణాచలంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పదిహేను మంది చిన్నారులతో కలిసి నృత్య ప్రదర్శన నిర్వహించారు.
- హైదరాబాద్‌లోని స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్‌బుక్ రికార్డు నృత్య ప్రదర్శనలో సైతం తన శిష్య బృందంతో పాల్గొని గిన్నిస్‌బుక్ వారి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు.

డాక్టర్ చదివించడమే లక్ష్యంగా..



కూతురు హన్నికతో స్వప్న, రాజన్న

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన నిచ్చకోల స్వప్న, రాజన్న దంపతులకు హన్నిక ఒక్కరే సంతానం. పెళ్లైన తర్వాత పాపైనా బాబైనా ఒక్కరినే కనాలని నిర్ణయించుకున్నారు. హన్నిక జన్మించాక దంపతులు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్నారు. కుమార్తెను ఉన్నతస్థితికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎస్‌సీసీఎల్‌లో చిరు కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న రాజన్న వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎన్నికష్టాలు వచ్చినా ఒక్కగానొక్క కూతుర్ని డాక్టర్ కోర్సు చదివించాలనుకున్నారు. 1 నుంచి పదోతరగతి వరకు బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ కార్పోరేట్ కళాశాలలో చదివించారు. ప్రస్తుతం ఆమెకు నీట్‌లో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పిస్తున్నారు. ఎంబీబీఎస్ సీటు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. తమ కూతురు డాక్టరై పేదలకు వైద్యం అందించి తమ కుటుంబ గౌరవాన్ని ఇనుమడింపజేస్తుందని ఆ దంపతులు ఆశిస్తున్నారు.

ఎవరైనా ఒకరే..



కూతురితో అన్నపూర్ణ జీవన్

ఈ రోజుల్లో ఆడ బిడ్డ, మగబిడ్డ అని కాదు.. ఎవరైనా సరే.. వారికి మంచి జీవితాని వ్వాలి. మాకు ఒక్క పాప శ్రీకృతి. తనను బాగా చదివించి, మంచి భవిష్యత్ ఇవ్వాలన్నదే మా కోరిక. ఆడపిల్లలు సైతం ఒంటరిగా అమెరికా వంటి దేశాలకు వెళ్లి చదువులు, ఉద్యోగాలు చేస్తున్నారు. వారిని మగవారితో సమానంగా చూడాలి. అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి.

జెడ్పీటీసీగా రాణిస్తూ..



బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి

బోథ్: మహిళలకు పదవులు ఉన్నా, వారి భర్తలే పెత్తనం సాగిస్తున్న ఈ రోజుల్లో మహిళా ప్రజాప్రతినిధురాలిగా ఉండి సొంత నిర్ణయాలు తీసుకుంటూ, మండలానికి నిధులు తేవడంలో సక్సెస్ అయ్యారు బోథ్ జెడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి. జెడ్పీటీసీగా బోథ్ మండలంలో తనదైన ముద్ర వేస్తున్నారు. జెడ్పీ సమావేశాల్లో పాల్గొంటూ సమస్యలను అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో సీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.10కోట్ల నిధులు తేవడంలో సక్సెస్ అయ్యారు.

జామ్నిలో ఇల్లు దగ్ధం

- నిరాశ్రయులైన ఆదివాసీ కుటుంబం



కాలిపోయిన సామగ్రి

జైనథ్: మండలంలోని జామ్ని గ్రామానికి చెందిన పెందూర్ దేవ్‌రావ్ ఇల్లు మంటల్లో కాలిపోయింది. స్థానికుల కథనం ప్రకారం... పెందూర్ దేవ్‌రావ్ భార్య, కుమారుడితో కలిసి గ్రామంలోనే కొంత దూరంలో నివసించే తన కూతురు రేఖ ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. రాత్రి వెళ్లే ముందు ఇంట్లో దీపం ముట్టించారు. కాగా ప్రమాదవశాత్తు దీపం కిందపడటంతో బట్టలకు నిప్పు అంటుకుంది. దీంతో ఇంట్లోని వంట సామగ్రి, ఇతర వస్తువులు, రూ.30వేల నగదు కాలిపోయింది. విషయం తెలుసుకున్న దేవ్‌రావ్ ఇంటికి వచ్చి, స్థానికుల సహాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో దేవ్‌రావ్ కుటుంబీకులు బోరున విలపించారు. అన్ని కోల్పోయి రోడ్డునపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని కోరుకుంటున్నారు. మొత్తం రూ.85వేల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు ఆర్ఐ విజయ్ తెలిపారు.

వైన్స్ షాప్‌లో చోరీ

తాంసి: మండల కేంద్రంలోని వైన్స్‌షాప్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. గురువారం ఉదయం తిరిగి వైన్స్ షాప్‌ను తెరచిన సిబ్బంది దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ సిబ్బంది వైన్స్‌షాప్‌ను పరిశీలించి వివరాలను సేకరించారు. షాపులో 37 మద్యం బాక్స్‌లను ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించారు. వాటి విలువ రూ.2.17 లక్షల విలువ ఉంటుందని వైన్స్ సిబ్బంది అంచనా వేశారు. వైన్స్‌షాప్ మేనేజర్ నర్సారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

సోన్: పురుగుల మందుతాగి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పాల్దే శ్రీనివాస్(40) కొన్నేళ్లుగా మద్యానికి బానిసై ఇంటిపని చేయకుండా తాగుతూ తిరుగుతున్నాడు. భార్య, తల్లి మందలించడంతో ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా చేనులో పురుగుల మందుతాగి పడిపోయి కనిపించాడు. దీంతో వెంటనే నిర్మల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోషం రవీందర్ తెలిపారు.

ఉరేసుకుని మరొకరు..

ఉట్నూర్‌రూరల్: మండలంలో కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ వివరాల ప్రకారం.. నాగాపూర్ గ్రామానికి చెందిన సింగారే యోగరాజ్ (40) అనే రైతు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం నాగాపూర్ గ్రామ పొలిమెరల్లోని చేనులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం మృతదేహాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సింగారే అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ ఉద్యోగి మృతి

సారంగాపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇరిగేషన్ ఉద్యోగి గురువారం ఆస్పత్రిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని జామ్ గ్రామానికి చెందిన మయ్యారి రమేష్(50) గురువారం నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయాడు. ఈక్రమంలో అతడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌లో నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆసుపత్రిలో మృతిచెందాడు. మృతుడు రమేష్ ఆరు నెలల క్రితం రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వీఆర్ఏలను తొలగించడంతో అతడికి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో లష్కర్ ఉద్యోగిగా విధులు అప్పగించారు. ఈ నెల 5వ తేదీనే మొదటి వేతనం తీసుకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఇది వరకు చేసిన 5నెలల వేతనం రావాల్సి ఉన్నా తొలివేతనం అందుకున్న సంతోషంలో ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం అతడిని కబళించింది. భార్య సుశీల రోదనలు గ్రామస్తులను కంటతడిపెట్టించాయి. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి..

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం... మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన తోకల పోశన్న(70) బుధవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై ధర్మారం నుంచి కనకపూర్ వైపు వస్తుండగా మార్గమధ్యలో పీచర శివారులోని దుబ్బ రాజేశ్వరస్వామి దేవాలయం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో పోషన్న తలకు తీవ్ర గాయం కావడంతో మృతిచెందాడు. మృతుడి భార్య తోకల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని నిర్మల్‌లోని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసు ఇన్‌చార్జి భోజన్న వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారం 2పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండగా గమనించిన సిబ్బంది మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుడి వివరాల కోసం సెల్: 9440442722పై సంప్రదించాలని పేర్కొన్నారు.